ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025
5
అల్లూరి సీతారామరాజు

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -పాడేరు :రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పాడేరు మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కోడి వాసు ఆధ్వర్యంలో లంబసింగి, ఎ.అన్నవరం సంత పరిధిలోని వాహనదారులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు, డ్రైవింగ్ లైసెన్స్తో పాటు అన్ని వాహనపత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగం, పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణం తగదని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

· నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈ నెల 12వ తేదీన నిర్వహించవలసిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను యధావిధిగా కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీన రద్దు చేసిన ప్రాక్టికల్ పరీక్షను తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని వెల్లడించారు.

సర్వం బంద్!

- అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలతో అట్టుడికిన మన్యం
- అఖిలపక్ష రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రోడ్డెక్కిన ఏజెన్సీవాసులు
- మూతబడిన బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు
- వ్యాపార సంస్థల స్వచ్ఛంద సంఘీభావం... బోసిపోయిన పర్యాటక ప్రాంతాలు

1/70 చట్టాన్ని సవరించాలన్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ విజయవంతమైంది. దట్టమైన పొగమంచులోనూ వేకువజామునే అఖిలపక్షపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రోడ్లపైకి చేరి నిరసన చేపట్టారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ నేతలు సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, దుకాణాలు, హోటళ్లు స్వచ్ఛందంగా మూతబడ్డాయి. వాహన రాకపోకలు స్తంభించిపోయాయి. రోడ్లన్నీ కర్ఫ్యూను తలపించేలా నిర్మానుష్యంగా మారాయి. రోడ్లపై బైఠాయించి రాస్తారోకోలు,మానవహారాలు, ర్యాలీలు, వంటావార్పు, ఇతర నిరసనలు, నినాదాలతో మన్యం దద్దరిల్లింది.

(ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)

పాడేరులో వేకువజామున మంచులోనే నిరసనకు దిగిన అప్పలనర్స, సురేంద్ర, రవిబాబు తదితరులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: 1/70 చట్టంపై విశాఖలో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో టిడిపి ముఖ్య నేత, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ అఖిలపక్ష రాజకీయ, ప్రజా సంఘాల వేదిక పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ తొలిరోజు మంగళవారం విజయవంతమైంది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండల కేంద్రాల్లోనూ బంద్ పక్కాగా జరగడంతో ఏజెన్సీలో జనజీవనం స్తంభించింది. అఖిలపక్ష రాజకీయ, ప్రజా సంఘాల వేదిక నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, ఎపి గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, వైసిపి నాయకులు కూడా సుబ్రహ్మణ్యం, దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం నేతృత్వంతో వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజా సంఘాలు సంయుక్తంగా తెల్లవారుజాము 4 గంటలకే అఖిలపక్ష రాజకీయ, ప్రజా సంఘాల వేదిక నాయకులు రోడ్లపైకి వచ్చి బంద్ పాటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు దుకాణాలు, హోటళ్లు, స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలు సైతం రోడ్డెక్కలేదు. పాడేరు పట్టణంలో రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఏజెన్సీలో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. జడ్పి చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, మాజీ ఎంపి గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిసిసి మాజీ చైర్మన్ స్వాతిరాణి, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎల్.సుందరరావు సిపిఐ జిల్లాకార్యదర్శి సత్యనారాయణ అమర్, పెదబయలు జడ్పిటిసి బొంజుబాబు, ఎంపిపి ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు కూడా సురేష్, టి.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ, ఆదివాసీ గిరిజన కాఫీ రైతుల జాతీయ నాయకులు లక్ష్మ పాల్గొన్నారు.

బంద్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా. పాడేరు డిఎస్పి షేక్ షాహాబాజ్ అహ్మద్ పోలీసు బందోబస్తును పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. పాడేరు సిఐ దీనబంధు ఆధ్వర్యంలో అడుగడుగునా బలగాలు మోహరించి, డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు.

అరకులోయ/ అరకు రూరల్: అరకు లోయలో రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ సక్సెస్ అయ్యింది. అరకులోయలో దుకాణాలు, పెట్రోల్ బంక్, టూరిజం హోటల్స్, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియం, పద్మావతి గార్డెన్, రణజిల్ల వాటర్ ఫాల్స్ మూతబడ్డాయి మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్ వెల వెల బోయింది. అరకులోయ టౌన్షిప్ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారింది. పార్టీలకతీతంగా ఆదివాసీ గిరిజన ప్రజా, ఉద్యోగ సంఘాలు రోడ్లపైకి వచ్చి నినాదాలు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ రోడ్డు వద్ద విద్యార్థులు ర్యాలీ మానవహారం నిర్వహించారు. రోడ్లపైనే భోజనం చేశారు.

. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ, విజన్ 2047లో భాగంగానే1/70 చట్టం సవరణపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేశారని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు బంద్లో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు జి బుజ్జిబాబు, చినబాబు, సీనియర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు,వైసిపి, నేత కమిడి అశోక్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శాంతి కుమారి, అశోక్, దుర్యానంద్, రామన్న, పల్లసింగి విజయ్ కుమార్, పాంగి చిన్నారావు, గెమ్మెలి చిన్నబాబు, పాల్గొన్నారు. సిఐ హిమ గిరి, ఎస్ఐ గోపాలరావు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

పెదబయలు : అయ్యన్న వ్యాఖ్యలకు నిరసనగా మన్యం బంద్లో భాగంగా సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటలకే అఖిలపక్ష నేతలు రోడ్డుపై చేరి బైఠాయించారు. మాజీ ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ పాల్గొని సంఘీభావంగా నినాదాలు చేశారు. అయ్యన్న వ్యాఖ్యలపై జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్కుమార్, ఆర్టిసి జోనల్ చైర్మన్ దొన్నుదొర వైఖరి స్పష్టం చేయాలన్నారు. బంద్తో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దుకాణాలు మూతబడ్డాయి. వాహన రాకపోకలు స్తంభించాయి. బంద్లో గంపరాయి సూరయ్య, కొమ్మ పుల్లేరాజ్, బొండా గంగాధరం కె, సూర్యనారాయణ జర్సింగి బాలం నాయుడు పాల్గొన్నారు.

హుకుంపేట: మన్యం బంద్ ప్రభావంతో బ్యాంకులు, పెట్రోల్బంకులు, దుకాణాలు, మూతబడ్డాయి. వారపుసంత బోసిపోయింది. సంతారి బూరుగుపుట్టు, ఉప్ప పరిసర ప్రాంతాల్లో రోడ్డుపై బైఠాయించి, కర్రల గేటు కట్టి వాహనాలను నిలుపుదల చేశారు. సిపిఎం, వైసిపి, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, ఎంపిపి కూడా రాజు బాబు, వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, ఆదివాసి మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ హైమావతి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాపుల కృష్ణారావు, సోమన్న, సిపిఎం మండల కార్యదర్శి లక్ష్మణరావు,రామారావు, ఎం.విశ్వేశ్వరరావు ఉన్నారు.

డుంబ్రిగుడ : మండలంలో ఆదివాసీ గిరిజనసంఘం, సిపిఎం, వైసిపి, అఖిల ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో రాష్ట్ర మన్యంబంద్ విజయవంతమైంది. మంగళవారంఉదయం నుంచి సాయంత్రం వరకు హైవే రోడ్డుపై బైఠాయించి బంద్ పాటించారు. చాపరాయి జలపాతం, దుకాణాలు మూతబడగా,ప్రైవేట్,ప్రభుత్వ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎమ్మెల్సీ రవిబాబు పాల్గొని సంఘీభావం ప్రకటించారు సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు,పి సురేష్ కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ,నాయకులు సత్యనారాయణ, వైసిపి మండలఅధ్యక్షుడు పిపరశురాం, బి సింహాచలం, సి హెచ్ కృష్ణారావు, ఎస్ ఆనంద్, ఎం శ్రీరాములు,యూటిఎఫ్ జిల్లా నాయకులు ఎస్ కన్నయ్య, ఎం సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఎస్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు :మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను ఆధ్వర్యంలో అఖిలపక్ష ప్రజాసంఘాలు బంద్లో పాల్గొన్నాయి. దుకాణాలు, స్వచ్ఛందంగా మూతబడ్డాయి. వాహనాలు నిలచిపోయాయి. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద వామపక్షాలు, ఇతర ప్రజా, ఉద్యోగసంఘాల నేతలు బంద్లో పాల్గొన్నారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, లక్ష్మీపురం సిపిఎం సర్పంచి కొర్ర త్రినాద్, సొలగం గాసిరం దొర పాల్గొన్నారు. బూసి పుట్టు వారపు సంత బంద్ పాటించారు.

ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రెసిడెంట్ గోవింద్, నాయకులు బాబూరావు, ముక్కి రామకృష్ణ ఆధ్వర్యంలో వంట వార్పు నిర్వహించారు.

అనంతగిరి (అరకు రూరల్) :అరకు ఘాట్ రోడ్డు ముఖద్వారమైన వెంకయ్యపాలెం జంక్షన్లో సిపిఎం మండల కార్యదర్శి కిల్లో మొస్య అధ్యక్షతన బంద్ జరిగింది. సిపిఎం అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, పర్యాటకాభివృద్ధి పేరుతో గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70చట్టాన్ని సవరించాలన్న స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు దుర్మార్గమన్నారు. ప్రధాని మోడీ ఆదేశాలతో సిఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్న ద్వారా మన్యంలోని వనరులన్నీ అదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు కట్టబెట్టే యత్నంలో భాగంగానే స్పీకర్ అయ్యన్న ఇలాంటి వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. షెడ్యూల్ ఏరియాలో హైడ్రో పవర్ ప్రోజెక్ట్ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బంద్ ప్రభావంతో బొర్రాగుహలు, ఇతర పర్యాటక ప్రాంతాలు మూతబడ్డాయి. వాహన రాకపోకలు నిలిచిపోగా, దుకాణాలు, వ్యాపారసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

కాంగ్రెస్ నేత శెట్టి గంగాధరస్వామి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పాంగి.అప్పారావు,కొర్ర సూర్యానారాయణ, ఎంపిటిసిలు టి మెతుల,శిరగం అశోక్, తవిటినాయుడు, సర్పంచ్లు మజ్జి అప్పారావు, సెంబీ సన్యాసిరావు,సివేరి సన్యాసిరావు శెట్టి లక్ష్మణరావు, సిపిఎం నాయకులు సివేరి కొండలరావు, కాకర సింగులు, మామిడి కృష్ణ పాల్గొన్నారు.

జి.మాడుగుల : మండల కేంద్రంలో మూడురోడ్ల కూడలిలో ప్రజా సంఘాలు అఖిలపక్ష నాయకులు బంద్లో పాల్గొన్నారు. దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సంతబయలు వారపు సంత బోసిపోయింది, పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.

చింతపల్లి : అఖిలపక్ష రాజకీయ, ప్రజా సంఘాల తలపెట్టిన మన్యం బంద్తో చింతపల్లిలో విజయవంతమైంది. కొర్రుబయలు, లంబసింగి, తాజంగి, మామిడిపల్లి, కొత్తపాలెం, బెన్నవరం అన్నవరం, లోతుగడ్డ, చౌడుపల్లి, చెరుకుంపాకలు, పెంటపాడు తదితర ముఖ్య కూడళ్లలో గిరిజనులు స్వచ్ఛందంగా తరలివచ్చి మన్యం బంద్ పాటించారు. జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపిపి కోరాబు అనూష దేవి, , ఉపాధ్యాయచ ప్రజా సంఘాలు సమన్వయంతో చింతపల్లి హనుమాన్ జంక్షన్లో మానవహారంగా ఏర్పడ్డారు. మాజీ ఎంపిపి కవడం మచ్చుమ్మ, మోరి రవి పాల్గొన్నారు.

రంపచోడవరం : అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ రంపచోడవరం మండలంలో విజయవంతమైంది. బంద్ నేపథ్యంలో సిఐటియు, గిరిజన సంఘాలు, అఖిలపక్ష ప్రజాసంఘాలు, సిపిఎం, వైసిపి తదితర పార్టీల నాయకులు తెల్లవారుజాము నుండి రోడ్లపై చేరుకుని తమ నిరసనను తెలియజేశారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ అయ్యన్న చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమా? లేదా ప్రభుత్వ విధానమా? అనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు. బంద్ పిలుపు నేపథ్యంలోనే రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి స్పందించారంటే ఇన్ని రోజులు గిరిజనుల నిరసనలు రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రులకు కనబడలేదా? అని ప్రశ్నించారు.కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, నాయకులు కంభం శాంతిరాజు, వైసిపి, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను పరిరక్షిస్తాం : కలెక్టర్

పాడేరు : 1/70 చట్టం రద్దు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదనిచ ఈ మేరకు సిఎం చంద్రబాబు ప్రకటించారని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు. మన్యం బంద్ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్లో అఖిలపక్ష రాజకీయ, ప్రజాసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలు, సందేహాలను సావధానంగా విన్నారు. అనంతరం మాట్లాడుతూ,. 1/70 చట్టాన్ని రద్దు చేస్తారనే అపోహాలను నమ్మవద్దన్నారు. గిరిజన సంఘాల వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షణకు ఐటిడిఏలలో ట్రైబల్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి జరగడం లేదని, 1/70 చట్టం రద్దు చేయాలని స్పీకర్ అసలేదని వివరణ ఇచ్చారు. జిల్లాలో 600 ఎల్టిఆర్ కేసులు మూడు,నాలుగు నెలలో పరిష్కరిస్తామన్నారు. అసధికార ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని, గిరిజనుల ఆదాయ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు. దీనిపై ఆదివాసీ.గిరిజన సంఘాల నేతలు అప్పల నర్స, రామారావు దొర, తడబారికి సురేష్ తదిరులు మాట్లాడుతూ గిరిజనుల ఆందోళన లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసీలకు స్పీకర్ క్షమాపణ చెప్పాలి

1/70 చట్టసవరణపై వ్యాఖ్యలు చేసిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న, ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలని ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల వేదిక డిమాండ్ చేసింది. ఈచట్టాన్ని సవరించే ఆలోచన లేదని సిఎం చంద్రబాబు ట్వీట్, గిరిజనసంక్షేమమంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ప్రకటనతో బంద్ యోజన విరమించినప్పటికీ, ఇంత రాద్ధాంతానికి కారణమైన అయ్యన్న క్షమాపణ చెప్పాలని, ఈనెల 24 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై సిఎం చంద్రబాబు స్పష్టమైన విధాన నిర్ణయ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బంద్ సందర్భంగా గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని, జిఒ 3 ప్రయోజనాల పునరుద్ధరణ హామీ నెరవేర్చాలని, నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్పించడానికి అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. పాడేరు ఎమ్మెల్యే ఎం విశ్వేశ్వరరాజు, గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనరస, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సమరెడ్డి మాణిక్యం, కూడా రాధాకృష్ణ పి.లక్కు, చుంచు రాజుబాబు, వంతల నాగేశ్వరావు, కూడ బొంజుబాబు, సల్లంగి మహేష్ పాల్గొన్నారు.

పాడేరులో ఆదివాసీ నేతలతో చర్చలు జరుపుతున్న కలెక్టర్ దినేష్కుమార్

నిలిచిపోయాయి. దుకాణాదారులు స్వచ్ఛందంగా షాపులను మూసివేసి బంద్కు సహకరించారు. రేఖపల్లి ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, ఎంపీపీ కారం లక్ష్మి, పలు పార్టీలు, సంఘాల నేతలు పులి సంతోష్ కుమార్, సోయం చిన్నబాబు, చిక్కాల బాలు, పిట్ట రామారావు, సవలం మారయ్య, వేటగాని మల్లయ్య, కనకా రెడ్డి, సారా పాండ్రాజ్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. హోటళ్లు బ్యాంకులు, మూతపడ్డాయి. తొలుత రోడ్డుపైకి రావొద్దని, ఎటువంటి ఆందోళనలు, ర్యాలీలు చేయెుద్దని స్థానిక సీఐ ఎన్.సన్యాసినాయుడు ఆంక్షలు పెట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గిరిజనులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని పోలీసులతో ఆదివాసీ నాయకులు వాగ్వివాదానికి దిగారు. గ్రామంలో పోలీస్ పహారా నడుమ ర్యాలీ నిర్వహించి, రహదారిపై ధర్నా చేపట్టారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు వంతు బాలకృష్ణ, కోండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, తాము సూరిబాబు, గంపా నాగరాజు, సింగిరెడ్డి అచ్చారావు, వజ్రపు అప్పారావు, బి రామకృష్ణ, పాల్గొన్నారు.

వై.రామవరం : వై.రామవరం మండలంలో ఆదివాసీల బంద్ ప్రశాంతంగా ముగిసింది. కిరాణా షాపులు, పాఠశాలలు మూతపడ్డాయి. 1/70 చట్టాన్ని సవరణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బంద్లో గిరిజన సంఘం నేతలుపాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, జీకే వీధి, రింతాడ, జెర్రెల తదితర పంచాయతీల్లో బంద్ విజయవంతమైంది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బందుకు మద్దతు తెలిపారు. సీలేరులో సర్పంచ్ పాంగి దుర్జో ఆధ్వర్యంలో గిరిజనులు మార్కెట్ సెంటర్ చేరుకొని నిరసన తెలిపారు. జీకే వీధి మెయిన్ బజార్ సెంటర్లో గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు ఆధ్వర్యంలో రహదారిని దిగ్బంధించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పలు సంఘాల నాయకులు సుంకర విష్ణుమూర్తి, బాకూరు కోటేశ్వరరావు, దారకొండ సర్పంచ్ నిడిగట్ల రాజు, గుమ్మడి మాజీ సర్పంచ్ బాబురావు, మనోజ్ కుమార్, పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని కొయ్యూరు, రాజేంద్రపాలెం, డౌనూరు, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో బంద్ జయప్రదమైంది. ఉదయం 6 గంటల నుంచి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. కొయ్యూరులో సిపిఎం, సిపిఐ, వైసీపీ, ఆదివాసీ జేఏసీ నేతలు ర్యాలీ చేసి, రహదారిపై బైఠాయించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, వైసీపీ నేతలు వారా నూకరాజు, అంబటి నూకాలమ్మ, చిన్నారావు, సూరిబాబు, సిపిఐ నేతలు ఇరువాడ దేముడు, జెఎసి నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల తీరు సరికాదు : గిరిజన సంఘాల నేతలు

కూనవరం : కూనవరం మండలంలో వ్యాపారస్తులు, ఆటో, మ్యాజిక్ యూనియన్లు స్వచ్ఛందంగా బంద్కు సహకరించారు. బంద్ చేస్తున్న క్రమంలో జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు ఆదివాసీ నాయకులు 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తీరుపై గిరిజన సంఘాల నేతలు తీవ్రంగా మండిపడ్డారు. కూనవరం ఎంపీపీ పాయం రంగమ్మ, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, గిరిజన సంఘాల నేతలు కుంజా అనిల్, తెల్లం తమ్మయ్య మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ను అడ్డుపెట్టుకొని పోరాటాన్ని అణిచివేయాలని చూస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు గుజ్జ మోహన్రావు, బాబు బొర్రయ్య, ప్రజాప్రతినిధులు గుజ్జ విజయబాబు, మడకం నాగమణి, సోడే శంకర్, బొగ్గా వెంకమ్మ, సున్నం రాంబాబు, కారం జయసుధ, తెల్లం నీరోషా, కరక వెంకన్న బాబు, మేకల నాగేశ్వరరావు, మాడెం బాబు, తాలూరి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

చింతూరు : చింతూరులో బంద్ విజయవంతమైంది. చింతూరు సెంటర్లో వ్యాపార దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలలు, కళాశాలు మూతపడ్డాయి. మండలంలోని చిడుమూరు, ఏడుగురాళ్లపల్లి, తుమ్మల, తులసిపాక, ఏజి కోడేరు ఇలా మండల వ్యాప్తంగా సంపూర్ణంగా బంద్ జరిగింది. బంద్ సందర్భంగా చింతూరు సెంటర్లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నేత పల్లపు వెంకట్, పలు సంఘాల నాయకులు సీసం సురేష్, పండా కృష్ణయ్య, బుగ్గ ముత్తయ్య, సోడే నారాయణ, జల్లి నరేష్, టి రవి, కాక సీతారామయ్య, కురసం బ్రహ్మయ్య, కారం నాగేష్, పాండు నాగర్జున్, పోడియం లక్ష్మణ్ పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో మన్యం బంద్ జయప్రదమైంది. మోతుగూడెంలో ఉన్న హైస్కూల్, బ్యాంక్, గ్రామ సచివాలయం మూతపడ్డాయి. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

ఎటపాక : మన్యం బంద్ సందర్భంగా ఎటపాక మండలంలోని మండల కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, పాఠశాలు, దుకాణాలు మూతపడ్డాయి. కార్యక్రమంలో సిపిఎం నేతలు కాకా అర్జున్ దొర, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, పలు సంఘాల నాయకులు ఇరపా అజయ్, పులుసు బాలకృష్ణ, ఇరపా సత్యం, బుద్ధుల భద్రయ్య, సోందే రామారావు, సవలం రాము, పొడియం రత్తమ్మ, తోట శ్రీను, నక్కా సూరిబాబు పాల్గొన్నారు.

విఆర్.పురం : బంద్ సందర్భంగా విఆర్.పురం మండలంలో తెల్లవారుజాము నుండే వాహనాల రాకపోకలు

అనంతగిరిలో మాట్లాడుతున్న సిపిఎం జెడ్పిటిసి గంగరాజు

నిర్మానుష్యంగా ఉన్న పాడేరు పట్టణంలోని రహదారి

మూతబడిన అరుకు గిరిజన మ్యూజియం

చింతూరులో రోడ్డుపైనే భోజనాలు చేస్తున్న ఆందోళన కారులు, గిరిజనులు

రంపచోడవరంలో మూతబడిన దుకాణాలు

రేషన్ బియ్యం కోసం పడిగాపులు

సేల్స్మెన్ నిర్లక్ష్యంతో ఒట్టిచేతులతోనే తిరుగుముఖం

సేల్స్మెన్ కోసం ఎదురుచూస్తున్న కార్డుదారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అనంతగిరి మండలం పినకోట పంచాయితీ బోనూరు, నందివలస, చిడిమెట్టు, గడ్డిబంధ, తాండెవలస, వంటలమామిడి గ్రామాల గిరిజనులు రేషన్బియ్యం కోసం మంగళవారం రోజంతా పడిగాపులు పడ్డారు. మంగళవారం ఉదయం 11గంటలకు వచ్చి రేషన్బియ్యం పంపిణీ చేస్తామని డిపో సెల్స్మెన్ చెప్పడంతో దాదాపు మూడు కిలోమీటర్ల దూరం కొండమార్గంలో మండుటెండలో చటకంభ గ్రామానికి ఉదయానికే చేరుకున్న కార్డుదారులు, సాయంత్రం 5 గంటల వరకు పడిగాపులు పడ్డారు. ఎంతకీ సేల్స్ మెన్ రాకపోవడంతో ఫోనులో సంప్రదించగా, రేషన్బియ్యం కోసం అంత కక్కుర్తి ఎందుకూ, ఎప్పుడైనా ఇవ్వక తప్పదుగా, వచ్చి ఇస్తానులే అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడని కార్డుదారులు వాపోతున్నారు. చివరకు ఒట్టిచేతులతోనే నిరాశగా వెనుదిరిగిన గిరిజనులు,.తక్షణమే సేల్స్మెన్పై చర్యలు తీసుకొని, రేషన్సరుకులు సక్రమ పంపిణీకి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రేషన్బియ్యం కోసం కాలినడకన కిలోమీటర్ల దూరం నడిచి వస్తున్న గిరిజనులు

మెరుగైన వైద్యసేవలకు టోల్ఫ్రీ నెంబర్

ప్రజాశక్తి-చింతపల్లి :వివిధ ప్రాంతాల నుంచి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి చికిత్సకు వచ్చే రోగులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి వైద్య సేవలు మరింత మెరుగ్గా విస్తరించే చర్యలు చేపడుతున్నట్లు ఆసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ ఇంద్ర ప్రియాంక అన్నారు. మంగళవారం ప్రాంతీయ ఆసుపత్రిలో విలేకర్లతో మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమన్వయంతో రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు.

ఇప్పటికే ప్రాంతీయ ఆసుపత్రిలో క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, అతి త్వరలోనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం చేపట్టి, సమావేశం నిర్వహిస్తామన్నారు. రోగులు తమ సమస్యలను ప్రత్యేక టోల్ఫ్రీ నెంబర్కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యాధికారులు బి లావణ్య, భారతి, రమేష్, సరోజిని, ఫార్మాసిస్ట్ సాంబశివరావు, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరెంటిండెంట్ ఇంద్ర ప్రియాంక.

నేడు ఏడు మండలాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం 220/33 కెవి సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా ఏజెన్సీలోని రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, దేవీపట్నం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపి ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్‌వి.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడు మండలాల్లోని గ్రామాలకు బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్తు లోటు ఏర్పడే అవకాశం ఉండటంతో వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలలో 'లెట్ అజ్ డు సైన్స్'

ప్రజాశక్తి-మధురవాడ : విద్యార్థులలో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా సైన్స్ ప్రయోగాలను ప్రభుత్వ పాఠశాలలలో ఆసక్తికరంగా చేసి చూపించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'లెట్ అజ్ డు సైన్స్' పేరిట ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తోంది. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజి కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి) సహకారంతో జిల్లా విద్యాశాఖతో కలిసి ఆనందపురం, నరవ, చంద్రంపాలెం, చింతల అగ్రహారం, పెందుర్తి తదితర ప్రాంతాలలో గల జిల్లా పరిషత్ పాఠశాలలలో వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు గీతం సహాయ ప్రొఫెసర్ డాక్టర్ బి.స్పందన తెలిపారు. అమెతో పాటు గీతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలలకు చెందిన డాక్టర్ వివికె.లక్ష్మి, డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ కె.ఆదర్శకుమార్, డాక్టర్ పి.కనకరాజు విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర విశేషాలను వివరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పాఠశాల విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి గీతం ప్రొఫెసర్లు సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఇళ్లలో ఉపయోగించే మిక్సర్, వాషింగ్ మిషన్, ఫ్యాన్, హీటర్, క్యాలికులేటర్ ఎలా పనిచేస్తాయో వాటి వెనక ఉపయోగించే శాస్త్ర విజ్ఞానం వివరిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నిత్య జీవతంలో రక్తం నమూనాలను పరిశీలించడం, వివిధ రకాల పరీక్షలు, వ్యాధి నిర్ధారణ వంటి అంశాలను తెలియజేస్తున్నారు. వీటితో పాటు సూర్య గ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడే విధానం వంటి అంశాలతో పాటు నూతన సంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్‌లు ఎగిరే సాంకేతికత, రోబోలు పనిచేసే తీరు వంటివి వివరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో గీతం ఇంజినీరింగ్, సైన్స్ విభాగాల ప్రొఫెసర్‌లతో పాటు సైన్స్ ఎడ్యుకేటర్లను, పిజి విద్యను అభ్యసిస్తున్న గీతం విద్యార్థులను భాగస్వాములను చేశారు.

విజయగౌరికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ మంగళవారం పలు సంఘాల నాయకులు మండలంలో ప్రచారం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్, ఇసాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్, గౌరవాధ్యక్షులు పైడిరాజు, భీమిలి సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, అప్పలనాయుడు, విలేకరి కె.సత్యనారాయణ పలు గ్రామాల్లో పర్యటించి ఓటర్లను కలిశారు. విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలో బోని సన్యాసినాయుడు, కె.సన్యాసిరావులను కలిసి ఈ నెల 27వ తేదీన జరిగే ఎన్నికల్లో విజయగౌరిని గెలిపించాలని కోరారు.

ప్రచారంలో పాల్గొన్న యుటిఎఫ్ ప్రతినిధులు

మధురవాడ : విద్యావంతుల గొంతుకై నినదిస్తున్న ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫెడరేషన్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ కోరారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలని కోరుతూ మధురవాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మారివలసలోని గిరిజన బాలికల ప్రతిభా గురుకులం, కొమ్మాదిలోని ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, వి టెక్నో విద్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, పిడిఎఫ్ వేదికలో ఉన్న వారంతా గొప్ప విలువలతో జీవిస్తున్న విద్యావంతులని తెలిపారు. ప్రజా, నిరుద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై శాసన మండలిలో సమర్థవంతంగా పోరాడుతున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు,అధ్యాపకులందరూ విజయగౌరికి మొదటి ప్రాదాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు రఘుపతి వెంకటరమణ, పి.రాజుకుమార్, బి.భారతి, డి.కొండమ్మ, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్రస్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా పోటీలలో పతకాలు సాధించిన రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులను పలువురు అధికారులు అభినందించారు. కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో రాష్ట్ర పిఇటి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా పోటీలలో రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలోని వివిధ గిరిజన ఆశ్రమ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు వివిధ పతకాలు సాధించినట్లు చెప్పారు. చింతూరు ఐటిడిఏ నుంచి యస్.నాగిరెడ్డి షాట్ పుట్‌లో సిల్వర్ మెడల్, యస్.వెంకటేష్ జావాలిన్ త్రోలో సిల్వర్ మెడల్, పి.లక్ష్మణ్‌రావు 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో బ్రాంజ్ మెడల్, కె.రమేష్ వాలీబాల్‌లో గోల్డ్ మెడల్, యస్.శ్రీను కబడ్డీలో గోల్డ్ మెడల్, యస్.మురళీ, యస్.ప్రసాద్, రమేష్ బాబు, వెంకటేష్ ఫుట్ బాల్‌లో బ్రాంజ్ మెడల్, కే.గంగా భవాని వాలీ బాల్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. రంపచోడవరం ఐటీడీఏ నుంచి కే.పోతురాజు 800 మీటర్ల పరువు పందెంలో గోల్డ్ మెడల్, సీతమ్మ జవాలిన్ త్రో గోల్డ్ మెడల్, వాలీబాల్‌లో గోల్డ్ మెడల్, నరసన్న దొర కబడ్డీలో గోల్డ్ మెడల్ సాధించారు. వీరిని ఎటిడబ్ల్యుఒలు కె.సుజాత, రామతులసి, అల్లూరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షులు వి.కృష్ణారావు, నాయకులు చిన్న స్వామిరెడ్డి, తిరుపతిరావు, పోతురాజు, సుజన్ దొర, బొర్ర రమేష్, అపక రమేష్, వెంకటేష్, దుర్గారావు, బాబురావు అభినందించారు.

పతకాలు సాధించిన వ్యాయామ ఉపాధ్యాయులు

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-అడ్డతీగల

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వి.జీవన్ ఆధ్వర్యాన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎపి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు, స్థానికంగా ఉన్న పిల్లలకు నులిపురుగుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవన్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. రెండు సంవత్సరాల పైబడిన పిల్లలకు సిరప్ రూపంలో ఇస్తామని చెప్పారు. ఐరన్ డెఫిషన్సీ, పిల్లలు పెరుగుదలలో గ్రోత్ తగ్గిపోకుండా తగిన సమయంలో ఈమాత్రలు ఇస్తామని చెప్పారు. హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండా సతీష్ మాట్లాడుతూ డబ్ల్యుహెచ్ఓ మార్గదర్శకాలు ప్రకారం ప్రతి ఒక్కరూ పోషకాలు ఉండే ఆహారం క్రమం తప్పకుండా తీసుకోకపోవడంతో మనసిక, శారీరక అభివృద్ధి దెబ్బ తినే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు నీరు విడుదల

ప్రజాశక్తి- సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం నుంచి 3000 క్యూసెక్కుల నీటిని గోదావరి డెల్టా పంట పొలాలకు మంగళవారం నుంచి విడుదల చేస్తున్నామని ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గోదావరి డెల్టా రబీ పంటకు సీలేరు కాంప్లెక్స్ నుంచి 10 టీఎంసీలు నీటిని విడుదల చేయాలని కోరారని పేర్కొన్నారు. ఏపీ జెన్కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. పది టీఎంసీలు నీటిని మూడు వేల క్యూసెక్కులు చొప్పున 40 రోజులు నీటిని విడుదల చేయాలని గోదావరి డెల్టా ఇరిగేషన్ అధికారులు కోరినట్లు ఎస్సీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సీలేరు కాంప్లెక్స్ పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4000 క్యూసెక్కులు నీరు గోదావరి డెల్టాకు చేరుతుందని తెలిపారు.

డొంకరాయి జలాశయం నుండి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

- 9 మంది అరెస్టు

ప్రజాశక్తి-వైరామవరం : వై.రామవరం మండలం చెవిటిదిబ్బల గ్రామంలో పేకాట శిబిరాలపై మంగళవారం పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. చెవిటిదిబ్బలలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో తమ సిబ్బందితో శిబిరంపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో 9 మందిని అదుపులో తీసుకొని వారి వద్ద ఉన్న రూ.8790 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కారు ఢీకొని సైక్లిస్టు దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్ - పోర్టు రోడ్డులో సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఎం.నరసింహారావు (56)ను కారు ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పాత గాజువాకకు చెందిన నరసింహారావు సైకిల్‌పై టీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

భయపెట్టి దోపిడీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం రఘు కళాశాల సమీపంలో సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో దారి దోపిడీ జరిగింది. అటుగా నడుస్తూ వెళ్తున్న చిప్పాడ దివీస్‌లో ఫిట్టర్‌గా పని చేస్తున్న శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రాంతానికి చెందిన లీలా వరప్రసాద్, అతని ఇద్దరు స్నేహితులను గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి బెదిరించి రూ.1000 లాక్కున్నారు. ముగ్గురిలో ఒకరిని బెదిరించి మరో రూ.5 వేలు తేవాలని బెదిరించారు. అలాగే అని చెప్పి వారి బారి నుంచి ముగ్గురూ తప్పించుకుని బయట పడ్డారు. బాధితులు మంగళవారం స్థానిక నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సూర్యప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి

శ్రీముద్ర స్కూల్ ప్రారంభంలో ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-ఆనందపురం : పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని, క్రమశిక్షణతో పాటు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రమైన ఆనందపురంలో శ్రీముద్ర స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా పాఠశాల ఆవరణలో శ్రీ సరస్వతి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, యువత స్వయం శక్తితో ఎదగాలన్నారు. శ్రీముద్ర స్కూల్ చైర్మన్ కుప్ప లహరి, డైరెక్టర్లు కాకర సురేష్‌కుమార్, పల్లి వీరాస్వామి పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాకర వెంకటరమణ, ఐటిబిపి సెకండ్ ఇన్ కమాండ్ సూరజ్ ప్రకాష్ జోషి, భీమిలి నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఇన్‌ఛార్జులు కోరాడ రాజబాబు, డాక్టర్ సందీప్ పంచకర్ల, కంటుభుక్త రామానాయుడు, ఆనందపురం, భీమిలి జడ్‌పిటిసిలు కోరాడ వెంకట్రావు, గాడు వెంకటప్పడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బంటుపల్లి మణి శంకర్ నాయుడు, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కొట్యాడ రమాదేవి, రెడ్డిబాబు, బంటుపల్లి అప్పలస్వామి, సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవంతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : విజయవాడ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 'జాతీయ స్థాయి హ్యాక్టాన్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' అంశంపై ఇటీవల నిర్వహించిన సాంకేతిక నైపుణ్య ప్రదర్శనలో తమ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచినట్లు స్థానిక అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళ వారం కళాశాలలో ముత్తంశెట్టి అభినందించారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 1600 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఆన్ కంప్యూటర్ విజన్ ఆధారిత రోబో నమూనాను ప్రదర్శించిన తమ కళాశాల విద్యార్థులు నిర్వాహకుల నుంచి ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

- ఏర్పాట్లపై సమీక్షలో ఇన్‌ఛార్జి డిఆర్ఓ సీతారామారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మార్చి 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి సీతారామారావు ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసి, పరీక్షల నిర్వహణకు అందరూ సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్, ప్రయివేటు, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై డిఇఒతో కలిసి మంగళవారం కలెక్టరేట్ విసి హాలులో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.

134 కేంద్రాలు, 29,997 మంది విద్యార్థులు

సమీక్షలో భాగంగా డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ పలు వివరాలను వెల్లడించారు. మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటి వరకు 134 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 28,523, ఓపెన్ విద్యార్థులు 1,404 కలిపి మొత్తం 29,997 మంది హాజరవుతున్నారన్నారు. వారిలో బాలలు 15,094 మంది కాగా, బాలికలు 13,429 మంది ఉన్నారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు, ఓపెన్ విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. రెండు కేంద్రాల్లో జరిగే ప్రయోగ పరీక్షలకు 404 మంది, ఏడు కేంద్రాల్లో జరిగే థియరీ పరీక్షలకు 1,271 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సమన్వయం వహించి పరీక్షలను విజయవంతంగా నిర్వహించటంలో పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, జివిఎంసి, వైద్యారోగ్య, రవాణా, విద్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ ఇవ్వాల్సిందే..

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేసి రిటైరైన కార్మికులకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలతో పాటు పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని డిఎ చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇపిఎస్ - 95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా విశాఖలో ఈ ధర్నా చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలంటూ మూడు రోజులపాటు ఢిల్లీలో నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం జంతర్ మంతర్ వద్ద ధర్నా, బుధవారం జాతీయ స్థాయి సదస్సు, గురువారం అన్ని పార్టీల ఎంపీలకూ వినతిపత్రాల అందజేత కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ కటాఫ్ డేట్ లేకుండా అందరికీ హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌కు అవకాశమివ్వాలన్నారు. పెన్షనర్‌కు, జీవిత భాగస్వామికి సంపూర్ణ వైద్య సేవలు అందించాలన్నారు. హయ్యర్ పెన్షన్ ఆప్షన్ దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేసి అర్హులైన వారందరికీ గౌరవప్రదమైన జీవితం అందించాలన్నారు. ఇపిఎస్ - 95 పెన్షనర్లకు రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు దీనబంధు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యువిఎస్ఎన్.వర్మ, నాయకులు ఎ.నారాయణరావు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు జరుగుతున్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1461వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించేందుకు, కార్మికులకు సకాలంలో పూర్తి వేతనాలు చెల్లించేందుకు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్లాంట్‌పై జరుగుతున్న కుట్రలను ప్రతి కార్మికుడూ అడ్డుకోవాలన్నారు. సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉక్కు పరిరక్షణ ఉద్యమం చరిత్రలో నిలిచిపోనుందని తెలిపారు.

మన్యం బంద్ దృశ్యమాలిక

బంద్‌తో బోసిపోయిన చాపరాయి జలపాత ప్రాంతం

జి.మాడుగులలో బంద్ నిర్వహిస్తున్న నాయకులు

హుకుంపేటలో..

కొయ్యూరులో..

పెదబయలులో..

ముంచంగిపుట్టులో..

రాజవొమ్మంగిలో..



విఆర్.పురంలో..

అభ్యర్థుల నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్ఓ హరేంధిర ప్రసాద్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో..

అభ్యర్థులందరూ అర్హులే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానంలో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన 10 మంది అభ్యర్థుల నామ పత్రాలూ ఆమోదం పొందాయి. ఎన్నికల అబ్జెర్వర్ ఎంఎం.నాయక్ ఆధ్వర్యంలో, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. అభ్యర్థులు సమర్పించిన అన్ని పత్రాలను సునిశితంగా పరిశీలించారు. పది మంది అభ్యర్థులూ మొత్తం 20 సెట్లు సమర్పించగా అందులో నాలుగు సెట్లు సరిగ్గా లేకపోవడంతో తిరస్కరణకు గురయ్యాయి. అయితే అభ్యర్థులు ప్రత్యామ్నాయ సెట్లు సమర్పించటంతో వాటిలో సరైన వాటిని రిటర్నింగ్ అధికారి పరిగణనలోకి తీసుకొని ఆమోదించారు. ప్రమాణాలకు అనుగుణంగా అందరి పత్రాలూ ఉండటంతో 10 మంది అభ్యర్థుల తాలూక నామినేషన్లను ఆమోదిస్తూ నిర్ణయం వెలువరించారు. ఆమోదించిన నామినేషన్లలో కోరెడ్ల విజయ గౌరి, పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, పెద్దపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావుల నామినేషన్లు ఉన్నాయి. కాగా, నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకు గడువు ఉంది. ఆరోజు పోటీలో ఎంతమంది ఉండేదీ స్పష్టంగా తెలియనుంది.

తుది జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు

తుది విడత జాబితా ప్రకారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని ఒక అభ్యర్థి అడిగిన ప్రశ్నకు బదులుగా రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్ తెలిపారు. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా ఫిబ్రవరి 10వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారని వివరించారు. 13వ తేదీన సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని, అదే రోజు సాయంత్రం 3.30 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థులందరితో సమావేశం జరుగ

క్యూబాకు మద్దతుగా నిలవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ క్యూబాపై ఆంక్షలు విధించడం ద్వారా అమెరికా ఆర్థిక యుద్ధం చేస్తోందని, ఇటీవల బెదిరింపులను తీవ్రతరం చేసిందని, ఈ తరుణంలో భారత దేశంలోని శాంతికాముకులంతా క్యూబాకు మద్దతుగా నిలవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అమెరికాకు వ్యతిరేకంగా తమ స్వరాన్ని వినిపించవలసిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే క్యూబాకు మద్దతుగా మంగళవారం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద కార్యక్రమం చేపట్టారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసి హెచ్‌వి.సాగర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి, అష్రాఫ్, రామాంజనేయులు, శ్యామల, కృష్ణవేణి, శ్రీనివాస్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామ్రాజ్యవాద అమెరికా ఎన్ని ఆంక్షలు విధిస్తున్నా క్యూబా వాసులు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని గుర్తుచేశారు. అమెరికాకు లొంగబోమని తేల్చిచెప్పారన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చాలా చిన్న దేశమైన క్యూబా మానవాళిని రక్షించడానికి చేసిన కృషిని వివరించారు. అటువంటి క్యూబాను ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేసే దేశంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం దుర్మార్గమన్నారు.